

# అనగనగా... ఒక కథ

## స్నేహానికి ప్రాణదానం

**కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ కళకళ లాడుంతుంటుంది.**

**ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకూ- సాయంత్రం 5 నుంచి 9 వరకూ సందడే సందడి.**

జీన్స్ పేంట్ టీ షర్టుల అమ్మాయిలు-పంజాబీ డ్రెస్‌ల అమ్మాయిలు-ఒక్కో రోజు మిలమిల లాడిపోతున్న లంగావోణీల ముస్తాబుల బాపుబొమ్మాయిలు-వాళ్లని పరిచయం చేసుకోవాలని తహతహలాడుతున్న అబ్బాయిలు-వాళ్ల ముచ్చట్లు-సైగలూ గుసగుసలు-కిలకిలకిలలూ- అదో...అందమైన ప్రేమమందిరంలా అనిపిస్తుంది చూపరులకి.

శశికాంత్ నిజానికి ఇనిస్ట్యూట్‌లో విద్యార్థి వేషం వెయ్యక్కర్లేదు. ఓ చిన్న ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గానే పనిచేస్తున్నాడు. మంచి ఎఫీషియంట్ వర్కర్‌గా..ఓ మోస్తారు మంచి జీతమే సంపాదిస్తాడు.

కానీ ఇప్పుడు...ఇక్కడ టైప్ మిషన్ కీబోర్డు మీద ఏబీసీడీలు ప్రాక్టీస్ చేస్తున్నాడు-అంటే..దానికి కారణం-మీకు తెల్సు-సరోజకీ తెల్సు.

ఇద్దరికీ ఆ ఇనిస్టిట్యూట్ ఓ ప్రేమ మందిరం.

సరోజ తన ఇంటి ముందు బైల్దేరే కొన్ని క్షణాల ముందు... గబగబ తన బైక్ స్టార్ట్ చేసి బస్ స్టాండ్ దగ్గర ఆటో డ్రైవర్‌లా ఉంటాడు శశికాంత్-సరోజ అతని భుజం మీద చెయ్యేసి బైక్ మీదకి ఎగిరి- సీట్ మీద ఒరిగి- అతని గేర్‌కి జడిసి-నడుం పట్టుకుని ఒదిగి-బైక్ డ్రైవర్‌ని తనే డ్రైవ్ చేస్తూంటే ఇద్దరూ ఆనంద విహారం చేసి ప్రేమ మందిరానికి వెళ్తారు.

నిజానికి 20 నిమిషాల దూరాన్ని స్ట్రెట్(ఎ)వే కాకుండా స్పీడ్ బ్రేకర్ల రోడ్లో...చుట్టు తిరిగి నలభై నిమిషాలకి చేరినా చాలా త్వరగా వచ్చేసినట్లు ఫీ'లా'తో ఉంటారు-

ప్రేమమందిరం కొంత దూరంలో ఉందనగా ఆమె అతన్ని మెచ్చుకోలుగా గిచ్చి రయ్‌న గెంతి ఇనిస్ట్యూట్‌లోకి పరిగెడుతుంది- ఇందాకణ్నుంచీ వెనక ఉండిపోయిన సౌందర్యాన్ని (వెనక నుంచే) చూస్తూ...ఆమె సెటిలయిన కొంతసేపటికి ప్రేమ మందిరానికి వెళ్తాడు శశికాంత్.

ఇంక ఏబీసీడీలు తిరగా మరగా బోర్లా తప్పుల తడకల్లా ప్రాక్టీసు చేస్తూ..సరోజనే చూస్తూ..సైగలు కొనసాగిస్తూ..తన ఆఫీసుకి టైమవుతోంటే విడవలేక..విడవలేక..వెళ్లిపోతాడు-ఇది రోజూ జరిగే సీరియల్ కథే.

★ ★ ★

కొన్నాళ్ళు ఈ కథని గమనిస్తున్న లావణ్య..ఒక రోజు అతను వెళ్లిపోయాక..సమయం చూసి..సరోజని అడిగింది.

''మీ ప్రేమకథకి పెళ్లితో శుభం కార్డు ఎప్పుడు వేస్తున్నారు''

''ప్రేమేంటి...'' సరోజ కంగారుగా అమాయకంగా అడిగింది.

''అబద్ధాలు మానెయ్- నేను నీకు అక్కనో చెల్లినో కాదు కదా- చుట్టాన్నో పక్కానో అంతకన్నా కాదు- నిజం చెప్పు- సస్పెన్స్ భరించలేకపోతున్నాను!'' లావణ్య అడిగిన తీరుకి సరోజకి నవ్వొచ్చింది! అయినా నవ్వాపుకుంది-

''ప్రేమాలేదు-దోమా లేదు-''

''బైక్‌మీద లిఫ్టులూ లేవు-తిరిగి...తిరిగి అక్కడాగి మళ్లీ ఇక్కడ కలవటాలూ లేవు-కదూ...''

సరోజు గుండె గుభిల్లుమంది.

నిజం వొప్పుకోక తప్పలేదు. సిగ్గుతోనూ...తలదించుకునీ సగం సగం గానూ పూర్తిగానూ కథ చెప్పేసింది...''సారీ నీతో అబద్ధం ఆడా'' అంది.

''వెరీగుడ్-తప్పువప్పుకున్న వాళ్లంటే నాకు ఇష్టం..ప్రేమ..'' అంది లావణ్య.

★ ★ ★

కొన్నాళ్లు సరోజా శశికాంత్‌తో కళకళలాడిన ప్రేమమందిరం సడన్‌గా ఇద్దరి నిష్క్రమణంతోనూ వెల వెల బోయింది.

లావణ్య- వాళ్లిద్దరూ లేచిపోయి..పెళ్లి చేసుకున్నారేమోలే- అనుకుని నవ్వుకుంది తృప్తిగా.

కానీ జరిగిన కథ వేరు-

సరోజ అన్నయ్య...శశికాంత్‌ని బెదిరించి-సరోజ నుంచి అతన్ని దూరం చేశాడు-సరోజకి రాజారామ్‌తో పెళ్లి చేసి..ఊపిరి పీల్చుకున్నాడు. సరోజ కూడా గతాన్ని మర్చిపోయి ఆనందంగా వుంది- ఇక్కడితో ఆగిపోతే మనకి కథ ఎక్కడిది?

★ ★ ★

సరోజ అన్నయ్య శంకర్ దేవుడిగుళ్లో దండలు మార్చుకున్న కొత్తపెళ్లాంతో ఇంటికొచ్చాడు- పెళ్లికూతుర్ని చూసి తల్లి తండ్రులు ముచ్చటపడ్డారు- కానీ ఆడపడుచు స్థానంలో ఉన్న సరోజ...వదినగా వచ్చిన లావణ్యని చూడగానే ఉలిక్కిపడింది.

తన కథ వదిన గుప్పెట్లో వుందని వణికిపోయింది.

తన కుటుంబానికి అందరికీ ఈ కథ చెప్పి రాజారామ్‌తో తను పొందుతున్న ఆనందాన్ని విచ్ఛిన్నం చేస్తుందని ఊహించుకుంది.

సరోజ భయం..లావణ్య జీవితాన్ని భయంకరంగా మారుస్తుందని ఎవరూ ఊహించలేరు.

★ ★ ★

లావణ్య సరోజని అలా ఫ్లాష్‌బేక్ చెప్పి హింసించాలని అనుకోలేదు- గతాన్ని గుర్తుచేసి బాధ పెట్టాలనుకోలేదు.

కానీ సరోజకి లావణ్య ఓ 'బూచి' అయిపోయింది.

ఫలితం అన్నయ్య శంకర్‌తో- చిన్న చిన్న నేరాలు చెప్పి-చాటు మాటుగా ఆమెని బెదిరించినట్లు కాకుండా హెచ్చరించి, పక్కనేవున్న తన ఇంటికి కూడా వెళ్లకుండా కాపలా కాసీ..లావణ్యని కనిపెట్టుకుంది..ఈ ఆడపడుచమ్మ.

మనసులో శతృత్వం విషం కలబోసుకుని వండుకుంటున్న సరోజకి భయం పాలు రోజు రోజుకీ ఎక్కువ అవుతోంది.

ఫలితంగా..చెల్లిని గారాబంగా చూసే శంకర్‌లో అసహనం వర్థించబడుతోంది-కథంతా రాస్తే కన్నీళ్లతో అక్షరాలు తడిసిపోతాయి-యధాతథంగా జరిగిన ముగింపు చెప్పేసుకుందాం.

ఓ అర్థరాత్రి పూట లావణ్య ఆత్మహత్య చేసు



కోబడింది.

ఆ రాత్రి సరోజ బతుకు స్థిమిత పడింది.

స్నేహం..భయంకరంగా మారుతుందా?

స్నేహానికి..ఫలితం ఆత్మనిష్క్రమణా?

అర్థంకాని అయోమయ బ్రహ్మరాతలో ఈ మలుపుల్ని ఎలా చదవాలి- అని లావణ్య ముగించిన కథ చదివిన శంకర్ కళ్లలో నీళ్లు తిరిగాయి.

''లావణ్యా'' ఇల్లు అదిరేటట్టు బిగ్గరగా అరిచాడు- వంటింట్లో పాలు తాగుతున్న లావణ్య వచ్చింది.

''ఈ కథ ఎవరు రాశారు''

''బ్రహ్మ''

''ఈ ముగింపు?''

''మీ చెల్లి రాస్తుంది-కాదు..మీ చేత రాయిస్తుంది''

''నీ ఉద్దేశం ఏంటి''

''ముగింపు..నేనే నిర్దేశించుకున్నాను. పది నిముషాల తర్వాత చెప్తాను..మీ చెల్లిముందు''

పది నిముషాల తర్వాత..లావణ్య చెప్పలేదు.

అంతేకాదు-ఎప్పటికీ చెప్పలేదు-

లావణ్యకి సరోజ పాలల్లో కలిపిన విషాన్ని...విషయాన్ని..ఆ హత్యని..ఆత్మహత్యగా తర్జుమా చేసింది.

లావణ్య శరీరం మీద పడి సరోజ ఏడుస్తోంది. శంకర్ చెల్లాయిని ఓదారుస్తున్నాడు.

లావణ్య మొదటిసారీ-చివరిసారీ రాసిన కథని శంకర్ జేబులో కుక్కుకుని మండుతున్న ఆమె చితిలో వేసి..చెల్లెలి జీవితాన్ని వెలిగించినట్లు ఫీలయ్యాడు.

*